మాకెదురే లేదు... మేమింతే !

- కత్తులు దూసిన కోడి పుంజులు
- యథేచ్ఛగా జూదం..
- రెట్టింపు నగదు చెల్లింపు అంటూ ప్రత్యేక ఆకర్షణ
- నెల్లూరు నుంచి బౌన్సర్లు...


బంటుమిల్లి బైపాస్ రోడ్డు 216 జాతీయ రహదారి పక్కన బరి వద్ద నిలిపిన వాహనాలు


పెడన మండలం కొంకేపూడి వద్ద కాయ్ రాజా కాయ్‌లో సినిమా యాక్టర్ల బొమ్మలపై బెట్టింగ్ పెడుతున్న ఆటగాళ్లు


పెడన పల్లోటి వద్ద కోడికి కత్తి కడుతున్న దృశ్యం


పెడన మండలం కొంకేపూడి బరి వద్ద లోపలకు వెళ్లనీయకుండా అడ్డుకుంటున్న నెల్లూరు బౌన్సర్లు


కృత్తివెన్ను మండలం మునిపెడలో కోడిపందెం లో విజేతకు బహుమతిగా అందజేసిన బుల్లెట్


కృత్తివెన్ను మండలం పల్లెపాలెం బరి వద్ద సందడి


కొడాలిలో కోడిపందేల వద్ద భారీగా నిలిపిన ద్విచక్ర వాహనాలు


పులిగడ్డలో కాయ్‌రాజా కాయ్


కోడూరులో తూర్పు వైపు బరి వద్ద ఫ్లడ్ లైట్ల వెలుగులో కోడిపందేలు

పెడన/కృత్తివెన్ను: కోడి పందేలు వేస్తే సహించం ..జూదక్రీడలు నిషేధం అంటూ పోలీసు ఉన్నతాధికారులు పలికిన పలుకులన్నీ ఉత్త ప్రగల్భాలే అని తేటతెల్లమైంది. 144 సెక్షన్ ఎక్కడా అమలు కావడం లేదు. సంక్రాంతి పండుగలో మొదటి రోజైన భోగి రోజే నియోజకవర్గంలో పలుచోట్ల విచ్చలవిడిగా కోడి పందేలు, జూదాలు, ఇతర నిషేధిత కార్యక్రమాలు నిర్వహించారు. పందెం నిర్వాహకులు తమకు ఎదురే లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. మండల పరిధిలో జాతీయ రహదారి పక్కన కొంకేపూడి రైస్‌మిల్లు వద్ద ఏర్పాటు చేసిన బరిలో ఏకంగా నెల్లూరు నుంచి బౌన్సర్లను రప్పించారు. లోపలకు ఎవరినీ పంపించకుండా కేవలం పందెం కోసం చేతిలో కోడిపుంజు ఉన్న వారిని మాత్రమే లోపలకు అనుమతిస్తున్నారు. పందెం రాయుళ్ల లోపల బరి చుట్టూ ఉంటూ పందేలను తిలకిస్తున్నారు. పల్లోటి వెనుక, తోటమూల, మడక గ్రామాల వద్ద ఏర్పాటు చేసిన బరుల వద్ద కూడా పందేలు జోరుగా కొనసాగుతున్నాయి. లోపల–బయట జూదం యథేచ్ఛగా సాగుతోంది. కాయ్ రాజా కాయ్ ఆటలో మూడు బొమ్మలను పెట్టి ఆ బొమ్మపై రూ.100 బెట్ కడితే.. గెలిస్తే ఒక బొమ్మపై రూ.150, మరొక బొమ్మపై రూ.200, ఇంకొక బొమ్మపై రూ.300 ఆశ పెట్టి దోచుకుంటున్నారు. ఈ బొమ్మలు సినిమా హీరోలకు సంబంధించినవి పెట్టడం గమనార్హం. ఆయా బొమ్మలపై బెట్టింగ్‌లు రెట్టింపు చెల్లింపులంటూ ఆకట్టుకుని నిలువునా దోచేసుకుంటున్నారు.

కృత్తివెన్ను మండలంలోని పల్లెపాలెం, గరిశపూడి, లక్ష్మీపురం, మునిపెడ, చినగొల్లపాలెం, ఒర్లగొందితిప్ప గ్రామాల్లో బరులు ఏర్పాటు చేసి పందేలు నిర్వహిస్తున్నారు. మునిపెడ, లక్ష్మీపురం బరులలో పందేల్లో విజేతలకు బుల్లెట్, మోటారుసైకిళ్లు బహుమతులుగా అందజేశారు. పందేలతో పాటు కోత ముక్క, గుండాట యథేచ్ఛగా కొనసాగడం విశేషం. మద్యం ప్రియులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా శిబిరాల వద్దే మద్యం విచ్చలవిడిగా విక్రయించడం కొసమెరుపు.

తగ్గేదేలే...

కొడాలి(ఘంటసాల): హైకోర్టు ఆదేశాల మేరకు కోడి పందేలు, జూదాలు నిర్వహిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామంటూ పోలీసు, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గ్రామ, మండల స్థాయి కమిటీలు విస్తృత ప్రచారం చేసినా పందేలు యథావిధిగా జరిగాయి. కూటమి నేతలు ఏమాత్రం తగ్గేది లేదంటూ మండలంలోని కొడాలి, లంకపల్లి గ్రామాల్లో కోడి పందేలు, జూదం ఆటలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ప్రధాన రహదారులకు సమీపంలోనే బరులు నిర్వహించడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. ఇంత మాత్రానికి ప్రభుత్వం, అధికారులు ప్రచార ఆర్భాటాలు చేసి ప్రజా సొమ్ము వ్యర్థం చేయడం తప్ప ఒరిగిందేమీ లేదంటూ ప్రజలు వాపోతున్నారు.

బరితెగించారు

తొలిరోజు రూ.8 కోట్లకు పైగా పందేలు

అవనిగడ్డ: కూటమి నేతలు బరితెగించారు. పోలీసులు ఎన్ని హెచ్చరికలు చేసినా లెక్కచేయలేదు. గతంలో ఎన్నడూ లేనివిధంగా అవనిగడ్డ నియోజకవర్గంలో ఈ సారి పెద్ద ఎత్తున కోడిపందేలు, జూదం ఆటలు యథేచ్ఛగా జరిగాయి. ముందు రోజు కొన్నిచోట్ల బరులను ధ్వంసం చేసినట్టు చెప్పిన పోలీసులు భోగి నాడు పెద్ద ఎత్తున జరిగిన కోడిపందేలు, జూద క్రీడలను అసలు పట్టించుకోలేదు. అవనిగడ్డ మండలంలోని పులిగడ్డ, అవనిగడ్డ, తుంగలవారిపాలెంలో జనసేన, టీడీపీ నేతల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున కోడిపందేలు, పేకాట, కాయ్‌రాజా కాయ్ ఆటలు జరిగాయి. పులిగడ్డలో పందెపురాయుళ్ల మధ్య గొడవలు జరిగాయి. టోల్‌ప్లాజా సమీపంలో పెద్ద ఎత్తున పేకాట, కాయ్‌రాజా కాయ్ నిర్వహించినా పోలీసులు అటువైపు కన్నెత్తి చూడలేదు. నియోజకవర్గంలో రికార్డు స్థాయిలో 23 చోట్ల కోడిపందేలు, పేకాట బరులు ఏర్పాటు చేశారు. ఒక్కో బరికి పోలీసులకు లక్ష నుంచి రూ.4 లక్షల వరకూ ముడుపులు ముట్టినట్టు బరుల నిర్వాహకులు చెప్పారు. సోమవారం ఒక్కరోజులోనే రూ.8 కోట్లకు పైగా పందేలు జరిగినట్టు అంచనా.

ప్రేక్షక పాత్రకే పరిమితమైన పోలీసులు

కోడూరు: కోడిపందేల నియంత్రణలో అధికార యంత్రాంగం పూర్తిగా విఫలమైంది. పోలీసులు ప్రేక్షకపాత్రకే పరిమితమయ్యారు. సంక్రాంతి పండుగకు వారం రోజుల ముందు నుంచి కోడిపందేలు, జూదానికి తావు లేదంటూ రెవెన్యూ, పోలీసు అధికారులు చేసిన హడావుడి అంతా ఉట్టుట్టిదే అన్నట్టయింది. పోలీసులు ఆదివారం పలుచోట్ల కోడిపందేల బరుల వద్ద ఏర్పాట్లను ధ్వంసం చేశారు. అయినా బరుల నిర్వాహకులు ఏమాత్రం వెనకడుగు వేయకుండా తమ పంతాన్ని నెగ్గించుకున్నారు. కోడూరు తూర్పువైపున రెండు బరులు, నరసింహాపురం రహదారిలో ఓ బరి, విశ్వనాథపల్లిలో మరో బరిలో కోడిపందేలు, జూదం యథేచ్ఛగా సాగాయి. మండలంలోని నాలుగు బరుల వద్ద తొలిరోజు సుమారు రూ.2కోట్ల మేర చేతులు మారినట్లు సమాచారం. తూర్పు వైపు తెలుగుదేశం, జనసేన పార్టీల నేతలు వేరువేరుగా రెండు బరులు ఏర్పాటు చేయగా, ఈ ప్రాంతంలో పేకాట, చిత్తుళ్లు, కాయ్ రాజా కాయ్, మేక–పులి ఆటలు జోరుగా సాగాయి. బరుల వద్ద ఆయా పార్టీల ముఖ్య నేతలు ఉండి ఆటలను ప్రోత్సహిస్తున్నారు. ఫ్లడ్ లైట్ల వెలుగులో పందేలు జరుగుతున్నా పోలీసులు ఆ వైపు కన్నెత్తయినా చూడలేదు. బరులు నిర్వాహకులు పోలీసులకు భారీస్థాయిలో ముడుపులు సమర్పించారనే విమర్శలు ఉన్నాయి. మరో రెండు రోజుల పాటు పోలీసుల అనుమతులు ఉన్నాయని నిర్వాహకులు చెప్పడం కొసమెరుపు.

క్లుప్తంగా

నూతన వస్త్రాల పంపిణీ



మచిలీపట్నంటౌన్: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని నగరంలోని తొమ్మిదో డివిజన్ వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ రాసంశెట్టి వాణిశ్రీ సోమవారం ఆ డివిజన్‌లో పనిచేస్తున్న సచివాలయ కార్యదర్శులు, పారిశుద్ధ్య కార్మికులకు నూతన వస్త్రాలను అందజేశారు. 25 మంది కార్యదర్శులు, పారిశుద్ధ్య కార్మికులకు వాటిని పంపిణీ చేశారు.

ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు



నాగాయితిప్ప(మోపిదేవి): భోగి పండుగ సందర్భంగా మండలంలోని నాగాయితిప్ప గ్రామంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో సోమవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ప్రముఖ వ్యాపారవేత్త విక్కుర్తి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి మహిళకు ప్రోత్సాహ బహుమతి అందించారు.

ముగ్గుల హరివిల్లు




మోపిదేవి: మండలంలోని రావివారిపాలెం గ్రామంలో సంక్రాంతి సందర్భంగా వేసిన ముగ్గు విశేషంగా ఆకట్టుకుంది. ప్రధాన రోడ్డు నుంచి ఇంటి పెరటి వరకు పూలతో అలంకరించిన పందిరి కింద రంగురంగుల ముగ్గుల హరివిల్లు ప్రధాన ఆకర్షణగా నిలిచింది.

వృద్ధులకు వస్త్రాల పంపిణీ

గోగినేనిపాలెం(ఘంటసాల): మండలంలోని గోగినేనిపాలెంకు చెందిన లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ ఘట్టమనేని బాబూరావు ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన 72 మంది వృద్ధులు, పేదలకు సోమవారం రూ.1000 నగదు, నూతన వస్త్రాలు, శాలువాలు అందజేశారు. మరో 8 మంది దివ్యాంగులకు రూ.1500 చొప్పున నగదు, ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్న గ్రామానికి చెందిన కొడాలి తేజస్వికి ల్యాప్‌టాప్‌ను పంపిణీ చేశారు.

సహాయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు



పెడన: పట్టణంలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని పలు చోట్ల సంక్రాంతి సంబరాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. సహాయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక మార్కెట్ యార్డులో జిల్లా స్థాయిలో గాలిపటాలు, ముగ్గుల పోటీలను నిర్వహించారు. తోటమూల వద్ద వరుదు రామకృష్ణ పతంగుల పోటీలను, ముగ్గుల పోటీలను మాజీ ఎమ్మెల్యే బూరగడ్డ వేదవ్యాస్ ప్రారంభించారు. టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

ఆనందోత్సాహాలతో భోగి వేడుక


చిట్టిపాలెంలో చండిక అజయ్ కుమార్ ఆధ్వర్యంలో భోగిమంట


నాగాయలంక సాయిమెస్ ఆవరణలో సంప్రదాయబద్ధంగా వేసిన భోగి మంట


చల్లపల్లిలో భోగిమంటలు వెలిగిస్తున్న డాక్టర్ డీఆర్‌కె ప్రసాద్

మచిలీపట్నంటౌన్: భోగి పండుగను నియోజకవర్గ ప్రజలు సోమవారం ఆనందోత్సాహాలతో జరుపుకొన్నారు. తెల్లవారుజామున నగరంతో పాటు గ్రామాల్లోని ప్రజలు వారి వాకిళ్లలో పెద్ద ఎత్తున భోగిమంటలు వేశారు. భోగిమంటలో కాచిన వేడి నీటితో స్నానాలు ఆచరించి, పూజలు చేశారు. పరాసుపేట సెంటర్లో 9వ డివిజన్ కార్పొరేటర్ రాసంశెట్టి వాణిశ్రీ ఆధ్వర్యంలో భోగిమంటలు వేశారు. గంగిరెద్దుల ప్రదర్శన ఆకర్షించింది. గొడుగు పేటలో ఆర్యవైశ్య యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు వేముల కృష్ణ, వాసవి క్లబ్ ప్రతినిధులు శ్రీకాకుళం రేణుకా రాణి– నరసింహ గుప్తా దంపతుల ఆధ్వర్యంలో భారీ ఎత్తున భోగిమంటలు వేశారు. చిట్టి పాలెంలో వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి చండిక అజయ్ కుమార్ ఆధ్వర్యంలో భోగిమంటలు వేశారు. సాయంత్రం పలు ప్రాంతాల్లో బొమ్మల కొలువులను ఏర్పాటు చేసి చిన్నారులకు భోగిపళ్లు పోసి ఆశీర్వదించారు.

నాగాయలంకలో...

నాగాయలంక: నాగాయలంక పరిసర గ్రామాలలో గ్రామీణ ప్రజలు భోగి పండుగను సంప్రదాయబద్ధంగా జరుపుకొన్నారు. తెల్లవారు జామున 4 గంటల నుంచి భోగి మంటలతో సందడి చేశారు.

కోడూరులో...

కోడూరు: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని మొదటి రోజు భోగి వేడుకలను ప్రజలు వేడుకగా నిర్వహించారు. సోమవారం ఉదయం ఇళ్ల ముందు భోగి మంటలు వేసి సంక్రాంతికి స్వాగతం పలికారు. ఇంటి ముందు అందమైన రంగవల్లులను తీర్చిదిద్దారు. పలువురు తమ ఇళ్లలో బొమ్మల కొలువులను ఏర్పాటు చేశారు. చిన్నారులపై భోగి పండ్లు పోసి ఆశీర్వచనాలు అందించారు.

పెడనలో...

పెడన: పట్టణంలో వేంచేసి ఉన్న శ్రీరుక్మిణీ సత్యభామా సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో భోగి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి హారతులు ఇచ్చారు. అనంతరం ఉత్సవ మూర్తికి ప్రత్యేకంగా పూజలు చేసిన ప్రధాన అర్చకులు మహిళా భక్తులు స్వామి వారి గీతాలను ఆలపిస్తూ భోగిపండ్లు, పూలతో అభిషేకం చేశారు. చిన్నారులకు భోగిపండ్లు పోశారు. ఆలయ ప్రధాన అర్చకుడు అగ్నిహోత్రం హరికృష్ణ స్వామి పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

గూడూరులో...

గూడూరు: భోగి పర్వదినాన్ని సోమవారం గూడూరు మండలంలో ఘనంగా జరుపుకొన్నారు. గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో యువకులు భోగి మంటలు వేసి సందడి చేశారు. సంప్రదాయబద్ధంగా స్నానాలు ఆచరించి నూతన వస్త్రాలు ధరించారు. ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంక్రాంతిని పురస్కరించుకుని పట్టణాల నుంచి తరలివచ్చిన బంధుగణంతో పల్లెల్లో పండుగ సందడి కనిపించింది.

అవనిగడ్డలో...

అవనిగడ్డ: దివిసీమలోని పలు ప్రాంతాల్లో భోగి పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. తెల్లవారు జామునే భోగిమంటలు వేశారు. స్థానిక ఎస్‌వీఎల్ క్రాంతి విద్యాసంస్థలో, మండల పరిధిలోని బందలాయిచెరువు ఎస్సీ కాలనీలో భారీగా భోగిమంటలు వేశారు.

చల్లపల్లిలో...

స్వచ్ఛ సుందర చల్లపల్లి ఆధ్వర్యంలో భోగిమంటలు వేశారు. నిర్వాహకులు డాక్టర్ డీఆర్‌కే ప్రసాద్ భోగిమంటల కార్యక్రమాన్ని ప్రారంభించారు.

వైభవంగా శివ ముక్కోటి ఉత్తర ద్వార దర్శనం


ఉత్సవ శివలింగానికి చైర్మన్ సాంబశివరావు, భక్తుల అభిషేకం, హారతులు


5,400 రుద్రాక్షలతో అలంకృతుడైన భావదేవరపల్లి కాశీవిశ్వేశ్వరుడు

నాగాయలంక: మహాశివుని జన్మ నక్షత్రంగా భావించే ఆర్ద్రా నక్షత్ర దర్శనోత్సవం, పుష్య పౌర్ణమి పర్వదినాలు, సోమవారం పురస్కరించుకుని స్థానిక శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ సమన్విత శ్రీపార్వతీ సమేత శ్రీనగరేశ్వరస్వామి ఆలయంలో శివ ముక్కోటి మహోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామి వార్ల ఉత్సవ మూర్తులతో ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు చేసి ఉత్సవ శివలింగానికి అభిషేకాలు, విశేషపూజలు జరిపారు. ఆలయ కమిటీ చైర్మన్ చిట్టా సాంబశివరావు నేతృత్వంలో ఆలయ అర్చకుడు కొల్లిపర సబ్బారావు నేతృత్వంలో క్షీరాభిషేకం, పసుపు, కుంకుమ, గంధం వివిధ రకాల ద్రవ్యాలతో విశేష అభిషేకాలు చేశారు. అనంతరం భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కలిగించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై శ్రీనగరేశ్వరుని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

5,400 రుద్రాక్షలతో అభిషిక్త శోభితుడు కాశీవిశ్వేశ్వరుడు

భావదేవరపల్లి(నాగాయలంక): శివముక్కోటి ఆరుద్ర నక్షత్రం, పౌర్ణమి సోమవారం, భోగి పర్వదినాలు పురస్కరించుకుని స్థానిక శ్రీఅన్నపూర్ణ సమేత శ్రీ కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి 5,400 రుద్రాక్షలతో విశేష అలంకారం జరిపారు. తొలుత ఆలయ ధర్మకర్త పూషడపు నిరంజనరావు ఆధ్వర్యంలో అర్చకుడు బ్రహ్మశ్రీ కొల్లిపర సుబ్బారావు బ్రహ్మత్వంలో భక్తుల సమక్షంలో వేకువ జామున పంచామృతాలు, పలు రకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు జరిపారు. రుద్రాక్షలతో సుందరంగా అలంకరించారు. ఈ సందర్భంగా శ్రీ అన్నపూర్ణదేవికి కుంకుమార్చన జరిపారు. అనంతరం శివముక్కోటి సందర్భంగా స్వామివారి ఉత్తర ద్వార దర్శనం నిర్వహించారు. గ్రామస్తులు, భక్తులు పాల్గొని భక్తిశ్రద్ధలతో అభిషేకాలు తిలకించారు.

భక్తిశ్రద్ధలతో శివ ముక్కోటి

మచిలీపట్నంటౌన్: నగరంలోని పలు శైవ క్షేత్రాల్లో శివ ముక్కోటి కార్యక్రమాన్ని సోమవారం భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నగరంలోని బలరాముని పేట మూడు స్తంభాల సెంటర్ వద్ద ఉన్న శ్రీ అన్నపూర్ణ సహిత కాశీ విశ్వేశ్వరుని స్వామి వారి ఆలయంతో పాటు చమ్మనగిరిపేట లోని గాంధీ బొమ్మ శివాలయంలో శివ ముక్కోటి నిర్వహించారు. అమ్మవారు, స్వామివార్లను పల్లకీపై ఊరేగించారు.

మోపిదేవి ఆలయంలో ఆరుద్రోత్సవం


మోపిదేవి పురవీధుల్లో ఊరేగుతున్న స్వామివారు

మోపిదేవి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న మోపిదేవి శ్రీవల్లీదేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దేవస్థానంలో సోమవారం ఆరుద్రోత్సవం (శివముక్కోటి) సందర్భంగా ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ఉప కమిషనర్ డీసీ దాసరి శ్రీరామ వరప్రసాదరావు ఆధ్వర్యంలో వేద పండితులు, అర్చక స్వాములు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివార్లను మయూరి వాహనంపై రావివారిపాలెం వరకు గ్రామోత్సవం నిర్వహించారు.

పెదకళ్లేపల్లిలో ధనుర్మాస ఆరుద్రోత్సవం

పెదకళ్లేపల్లి(మోపిదేవి): మండలంలోని పెదకళ్లేపల్లిలో ఉన్న శ్రీదుర్గాపార్వతీ సమేత నాగేశ్వరస్వామి వారి దేవస్థానంలో సోమవారం ధనుర్మాస ఆరుద్రోత్సవం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ డీసీ దాసరి శ్రీరామవరప్రసాదరావు ఆధ్వర్యంలో వేద పండితులు బుద్ధు ప్రసాద్ శర్మ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రాజాధిరాజ వాహనంపై స్వామివార్లను వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

మంగమ్మ మృతదేహానికి మాజీ ఎమ్మెల్యే సింహాద్రి నివాళి

మోపిదేవిలంక(మోపిదేవి): మోపిదేవిలంక గ్రామ మాజీ సర్పంచ్ తురక మంగమ్మ(85) అనారోగ్యంతో ఆదివారం సాయంత్రం ఇంటివద్ద మృతిచెందారు. విషయం తెలుసుకున్న అవనిగడ్డ మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి సింహాద్రి రమేష్‌బాబు సోమవారం ఆమె మృతదేహాన్ని సందర్శించి ఘననివాళులర్పించారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

రేమాలవారిపాలెంలో వేడుకగా మా ఊరి సంక్రాంతి

రేమాలవారిపాలెం(నాగాయలంక): మా ఊరి సంక్రాంతి సంబరాలలో భాగంగా మండలంలోని రేమాలవారి పాలెం గ్రామంలో సోమవారం సంక్రాంతి ముగ్గుల పోటీ నిర్వహించారు. సాయి బేకరీ అధినేత గుడి కోటేశ్వరరావు(కోటి)ఆర్థిక సౌజన్యంతో యూత్ ఆధ్వర్యంలో జరిపిన ముగ్గుల పోటీలను నాగాయలంక ఎస్‌ఐ కె.రాజేష్ ప్రారంభించారు. గ్రామస్తులంతా సందడిగా పాల్గొన్నారు. గాలి పటాలను ఎగురవేసి కేరింతలు కొట్టారు. మహిళలు రంగవల్లులు తీర్చిదిద్దారు. విజేతలుకు ఎస్‌ఐ చేతులమీదుగా బహుమతులు అందించారు. మత్తి రాజారావు, ఉపసర్పంచ్ పేర్ల భీమేశ్వరరావు, తుంగల రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు అయ్యప్ప మకరజ్యోతి దర్శనం

కోడూరు: అపర శబరిమలగా పేరుగాంచిన కోడూరు అయ్యప్ప స్వామివారి దేవాలయం వద్ద మంగళవారం భక్తులకు మకరజ్యోతి దర్శనాన్ని కల్పించనున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త బడే భావన్నారాయణ సోమవారం తెలిపారు. ఉదయం ఆలయంలోని మూలమూర్తికి ప్రత్యేక అభిషేకాలు ఉంటాయని, సాయంత్రం స్వామివారి నగలను ఊరేగించనున్నట్లు చెప్పారు. ఊరేగింపు అనంతరం అయ్యప్పకు ప్రత్యేక అలంకారం చేసి, మకరజ్యోతి దర్శనాన్ని కలిపిస్తున్నట్లు భావన్నారాయణ తెలిపారు.

బుద్ధ విహార్‌ను సందర్శించిన ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల

ఘంటసాల: గ్రామంలోని అమరావతి బుద్ధ విహార్‌ను ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, ఆయన సోదరుడు కొనకళ్ల జగన్నాథరావు (బుల్లయ్య) సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా బౌద్ధ బిక్షువు భంతే ధమ్మ ధజ థెరో కొనకళ్ల నారాయణకు, ఎన్నారై గొర్రెపాటి రంగనాథ బాబుకు పంచశీల కండువా కప్పి బౌద్ధ ఆశీర్వచనాలు అందించి సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ గొర్రెపాటి రామకృష్ణ, వేముల కృష్ణ, కొండపల్లి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతి ప్రదానం

గూడూరు: సంక్రాంతిని పురస్కరించుకుని గూడూరులో నిర్వహించిన వివిధ పోటీలలో విజేతలకు సోమవారం బహుమతి ప్రదానోత్సవం నిర్వహించారు. స్థానిక గాంధీ బొమ్మ సెంటరులో సంక్రాంతి సందర్భంగా లెమన్ అండ్ స్పూన్, స్లో మోటార్ సైకిల్, మ్యూజికల్ చైర్ పోటీలు నిర్వహించారు. లెమన్ అండ్ స్పూన్ పోటీలో అల్లం లక్ష్మీ కుసుమ మొదటి బహుమతి, నిడుమోలు భవ్యశ్రీ ద్వితీయ బహుమతి సాధించారు. మ్యూజికల్ చైర్‌లో ముద్దినేని సురేఖ విజేతగా నిలవగా, వీరవల్లి భారతి ద్వితీయ స్థానంలో నిలిచింది. స్లో మోటార్ సైక్లింగ్‌లో పోతన గంగాధర్ మొదటి స్థానం సాధించగా, మట్టా సాయి రెండో స్థానంలో నిలిచాడు. విజేతలకు రూ.2వేలు, ద్వితీయ స్థానం సాధించిన వారికి రూ.వెయ్యి చొప్పున బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో డీసీ చైర్మన్ పోతన వెంకట లక్ష్మీనరసింహస్వామి, మాజీ సర్పంచి పోతన రామోజీ తదితరులు పాల్గొన్నారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా మత్తి అరుణ, రాసంశెట్టి భగవన్నారాయణ, బొమ్మిశెట్టి ప్రభు వ్యవహరించారు.